జిల్లాలో హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్, బీపీసీఎల్ కలిపి 37 ఏజెన్సీల ద్వారా ఉన్న గ్యాస్ కనెక్షన్లు: 6,92,825

తెల్లరేషన్ కార్డుదారుల సంఖ్య : 6,71,803

న్యూస్‌టుడే, ఎచ్చెర్ల, (రణస్థలం), కలెక్టరేట్(శ్రీకాకుళం)



పేద కుటుంబాలకు దీపావళి..!

పేద కుటుంబాల్లో దీపావళి కాంతులు విరజిమ్మేలా చేయడానికి కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన ఉచిత సిలిండర్ పథకం అమలుకు ముహూర్తం ఖరారైంది. పండగ రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా దీన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా పేద కుటుంబాలకు ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. తెల్ల రేషన్‌కార్డుదారులే లబ్ధి పొందుతారు. ఇక నుంచి ఇంటి ఖర్చులో భాగమైన సిలిండర్ ఖర్చు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఫలితంగా వారికి ఆర్థికంగా ఉపశమనం లభిస్తుంది. ఈ నేపథ్యంలో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● జిల్లాలో తెల్లకార్డుదారులకు ఉచిత సిలిండర్ పథకం వర్తిస్తుంది. తెల్లకార్డు కలిగి గ్యాస్ కనెక్షన్ ఉన్న వారి వివరాల సేకరణలో పౌర సరఫరాల శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. గతంలో సాధారణ కనెక్షన్ పొందే సమయంలో రేషన్ కార్డు తప్పనిసరి చేయలేదు. ఇలాంటివి 3,40,318 ఉన్నాయి. వారిలో తెల్ల రేషన్ కార్డు ఉన్న వారు ఎంతమంది? బీపీఎల్ పైన ఉన్న వారు ఎందరు? వంటి వివరాలు తేలాల్సి ఉంది. దీపం, ఉజ్వల్, సీఎస్ఆర్ కనెక్షన్లు తెల్ల రేషన్ కార్డులు కలిగిన వారికే ఇచ్చారు. వాటి కింద 3,52,507 మంది వినియోగదారులు ఉన్నారు. వీరంతా తెల్ల రేషన్ కార్డుదారులే.

● సిలిండర్ బుక్ చేసుకునే సమయంలో వినియోగదారులు తెలుపు రేషన్ కార్డు, ఆధార్, గ్యాస్ కనెక్షన్ నంబర్లు ఏజెన్సీ ప్రతినిధులకు అందజేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 29 నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి మార్గదర్శకాలు గ్యాస్ ఏజెన్సీలు, పౌర సరఫరాల శాఖ అధికారులకు ఇంకా చేరలేదు. ప్రస్తుతం గ్యాస్ ధర రూ.829.50 ఉంది. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఉచితంగా ఇస్తే ఒక్కో లబ్ధిదారుకు రూ.2,488.50 ఆదా అవుతాయి.

ఎంతో ప్రయోజనం..



దీపావళి నుంచి ఉచిత సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఆనందంగా ఉంది. ఏటా మూడు బండలు ఉచితంగా సరఫరా చేయనుండటంతో ఆ మేరకు ఖర్చు తగ్గుతుంది. మాలాంటి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పండగ వేళ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. పేద కుటుంబాల్లోని మహిళలు ఆయనకు రుణపడి ఉండాలి.
– ఎస్.పద్మ, గృహిణి, షేర్‌మహ్మద్‌పురం

తప్పనిసరి

కార్డులో పేరున్న ప్రతి సభ్యుని ఈకేవైసీ ప్రభుత్వం తప్పనిసరి చేసింది. నిర్ణీత వ్యవధిలోగా వాలంటీర్ల ద్వారా గానీ, రేషన్ డీలర్ల వద్ద గానీ ఆ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. – ఎ.పాపారావు, జిల్లా పౌర సరఫరాల అధికారి

అమలుకు చర్యలు..

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. అవి రాగానే అర్హులైన లబ్ధిదారులందరికీ పథకం అమలు చేయడానికి చర్యలు తీసుకుంటాం.
– జి.సూర్యప్రకాశరావు, డీఎస్‌వో, శ్రీకాకుళం



కార్యకర్త కుటుంబానికి ఉపయోగపడేలా సభ్యత్వ గుర్తింపు కార్డు

తెదేపా కార్యకర్తలు, వారి కుటుంబాలకు ఉపయోగపడేలా సభ్యత్వ గుర్తింపుకార్డును తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సభ్యత్వ నమోదు సన్నద్ధతపై టెక్కలి నియోజకవర్గ స్థాయి సమావేశం కోటబొమ్మాళిలో శుక్రవారం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు.
– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

ఉచితం మాటున చీకటి దందా..!

నిర్మాణదారులు తమ అవసరాల కోసం నాటుబండ్లు, ట్రాక్టర్ల ద్వారా అనుమతులు ఉన్న నదీ ప్రాంతాల్లో ఇసుక ఉచితంగా తీసుకెళ్లొచ్చు. ఎలాంటి రుసుం చెల్లించాల్సిన పనిలేదు..
– రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన ఇది..

..ఈ మాటతో జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ రంగానికి కొత్త ఊపు వచ్చినట్లయింది.. ఇసుక కొనలేక ఆర్థికంగా సతమతమవుతున్న నిర్మాణదారులకు ఊరట లభించింది.. కానీ ఇదే అదనుగా అక్రమార్కులు అప్పుడే కొత్త దందాకు తెరలేపారు.. ఇసుక ఉచిత విధానానికి తూట్లు పొడుస్తున్నారు. నాగావళి, వంశధార నదుల్లో అనుమతి లేనిచోట ఇసుక తవ్వేయడమే కాక ఉచితం మాటున ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రివేళ లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆమదాలవలస, శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాల పరిధిలో ఈ దందా ప్రారంభమైంది. ఇసుక అక్రమంగా తోడేస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.
– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం



అనుమతుల్లేని చోట ఇసుక తవ్వకాలు

రహస్య ప్రాంతాల్లో నిల్వలు

రాత్రివేళ విశాఖకు తరలింపు

జిల్లాలో మొత్తం ఐదు ఓపెన్ రేవులు, మూడు డీసిల్టేషన్ ప్రాంతాలకు అధికారికంగా అనుమతులు ఉన్నాయి. వీటిలో ఓపెన్ రేవులు బూరవెల్లి, అంబల్లవలస, గోపాలపెంట, బట్టేరు, నివగాంలో ఉన్నాయి. వీటి నుంచి మాత్రమే నిర్మాణదారులు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా మాన్యువల్ పద్ధతిలో తవ్వి తీసుకెళ్లొచ్చు. యంత్రాల ద్వారా తరలించేందుకు వీలులేదు. డీసిల్టేషన్ కింద గార, కాఖండ్యం, అంగూరు ప్రాంతాలను గుర్తించారు. వీటి ద్వారా ఇసుకను తీసి స్టాక్ పాయింట్‌లో నిల్వ చేస్తారు. దీనిని బుకింగ్ చేసుకున్న వారు సంబంధిత రుసుం చెల్లించి లారీల ద్వారా పట్టుకెళ్లొచ్చు. కానీ ప్రస్తుతం జిల్లాలో ఈ ప్రక్రియకు అనుమతులు లేవు.

● **ఆమదాలవలస:** దూసి, దూసి పేట, తొగరాం, కొత్తవలస, నెల్లిమెట్ట, పాతూరు, నిమ్మతొర్లువాడ, కొరపాం, తోటాడ, జీకెవలస, గోపీనగరం గ్రామాల్లో ఇసుక నిల్వలు చేస్తున్నారు. బూర్జ మండలం గుత్తావెల్లి, నారాయణపురం, పొందూరు మండలం పెద్ద బొడ్డపెల్లి, సింగూరు ప్రాంతాల్లో నిల్వ ఉంచుతున్నారు.

● **నరసన్నపేట:** కోమర్తి సమీపంలోని ఓ మిల్లు కేంద్రంగా ట్రాక్టర్లతో పెద్ద మొత్తంలో నిల్వ చేసి రాత్రివేళ తరలిస్తున్నారు. లుకలాం, జలుమూరు మండలం పర్లాం ప్రాంతాల్లో ఇదే తరహా దందా సాగుతోంది.

● **శ్రీకాకుళం:** రాగోలు, బావాజీపేటలో నిల్వ చేస్తున్నారు. నాటుబండ్ల ద్వారా కొత్త రోడ్డు వద్ద జాతీయరహదారి పక్కనే నిల్వ చేసి లారీలకు ఎత్తి విశాఖకు తరలిస్తున్నారు. బహిరంగంగా జరుగుతున్నా అడిగేవారే లేరు. గార మండలం బూరవెల్లి, జోగిపంతుళ్లపేట, శాలిహుండం, వమరవల్లి, కళింగపట్నం ప్రాంతాల్లో ట్రాక్టర్ల ద్వారా తోడేసి అమ్ముతున్నారు.



దూసి-కొత్తవలస రహదారిలో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన లారీలు

ప్రభుత్వ విధానానికి తూట్లు..

నాగావళి, వంశధార నదీ తీరం వెంబడి పలు గ్రామాల్లో ఎక్కడికక్కడ ఇసుకను పెద్ద మొత్తంలో ట్రాక్టర్ల ద్వారా నిల్వ చేస్తున్నారు. వీటిని ఒక్కో లోడు లారీకి సుమారు రూ.30-50 వేల వరకు విక్రయిస్తున్నారు. ఆమదాలవలస మండలం దూసి వద్ద ట్రాక్టర్లతో అనుమతి లేకుండానే తవ్వుతున్నారు. ఒక్కో లోడు రూ. 2,500 నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. మరికొంత చుట్టుపక్కల గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో నిల్వ చేసి రాత్రివేళ లారీలకు ఎత్తి విశాఖకు తరలిస్తున్నారు.

అనుమతిలేకుండా తవ్వితే చర్యలు..

జిల్లాలో ఐదు ఓపెన్, మూడు డీసిల్టేషన్ రేవులకు మాత్రమే అనుమతి ఉంది. వీటి ద్వారా మాత్రమే అవసరమున్న వారు ఇసుక తీసుకెళ్లాలి. అనుమతి లేని చోట తవ్వడం చట్ట విరుద్ధం. అక్రమంగా నిల్వ చేసి అమ్మితే చర్యలు తప్పవు. వాహనాలను జప్తు చేస్తాం. – సి.మోహనరావు, డీడీ, జిల్లా భూగర్భ గనుల శాఖ



శ్రీకాకుళం గ్రామీణ మండల పరిధి కొత్త రోడ్డు వద్ద జాతీయ రహదారి పక్కన నిల్వ చేసిన ఇసుక

అన్నదాత కష్టం రసాయనాల పాలు..!

ఎచ్చెర్ల(లావేరు), న్యూస్‌టుడే: లావేరు మండలం బుడుమూరు వద్ద జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న వరి పొలాల్లోకి గుర్తుతెలియని వ్యక్తులు ఇతర ప్రాంతాల నుంచి రసాయనాలను తెచ్చి విడిచి పెట్టడంతో వరి పంట నల్లగా మాడి పనికిరాకుండా పోయింది. రెండు రోజుల కిందట బుడుమూరు నారాయణసాగరం ఆయకట్టులో ఉన్న సాగునీటి కాలువల్లోకి ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్లతో రసాయనాలు తీసుకొచ్చి విడిచిపెట్టారు. ఈ సాగునీటి కాలువల నుంచి రసాయనాలు ఏ వరి పొలాల్లోకి వెళ్లాయో ఆ పంట మొత్తం నల్లగా మారి పనికిరాకుండా పోయింది. బుడుమూరుకు చెందిన బొల్లి రాంబాబు, గొర్లె సూర్యానారాయణ, గొర్లె రాజారావు, రాయవలస అప్పారావు, రాయవలస రాజారావు, కోటేశ్వరరావు, సత్యనారాయణ తదితర రైతులకు చెందిన సుమారు 15 ఎకరాల వరి పంట పనికిరాకుండా మాడిపోయిందని గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు.



నల్లగా మాడిపోయిన వరి పంట

రౌడీ షీటర్ల వివరాల సేకరణ

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, అనుమానితుల ఫొటోలు తీస్తున్నారు. రౌడీషీట్ తెరిచే సమయంలో ఉండే ఫొటోలే అందుబాటులో ఉన్నాయి. ఎంత మంది సత్ప్రవర్తనతో ఉన్నారనే సంఖ్య తేలకపోవడంతో పోలీసుస్టేషన్ల వారీగా వివరాలు సేకరిస్తూ ఫొటోలు తీస్తున్నారు. 44 పోలీసుస్టేషన్ల పరిధిలో సుమారు 600 మందికి పైగా రౌడీషీటర్లు, 450 మందికి పైగా అనుమానితులు ఉన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో 31 మంది రౌడీషీటర్లు, 53 మంది అనుమానితులు ఉన్నారు. రెండో పట్టణ పరిధిలో 37 మంది రౌడీషీటర్లు, 46 మంది అనుమానితులు ఉన్నారు. నడవడిక సరిగా లేని మరికొందరిపై త్వరలో రౌడీషీట్ తెరవనున్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూలు విడుదల

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్లలోని డా. బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సంబంధించి ఏడాది కాల వ్యవధి విధానంలో డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూలును వర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ డా. ఎస్. ఉదయ్‌భాస్కర్ శుక్రవారం విడుదల చేశారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులకు నవంబరు 4 నుంచి 18వ తేదీ వరకు, తృతీయ సంవత్సరం నవంబరు 20 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వర్సిటీ కేంద్రంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్ర 5గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.



భావనపాడులో హార్బరు ప్రతిపాదిత ప్రాంతం

భావనపాడులో ఏర్పాటుకు చర్యలు

నెరవేరనున్న తీరప్రాంత మత్స్యకారుల కల

హార్బరు వైపు అడుగులు..!

భావనపాడు ఫిషింగ్ హార్బర్ నిర్మాణం.. ఈ ప్రకటన విన్నప్పుడల్లా మత్స్యకారుల కళ్లెదుట ఎన్నో ఊహలు...మరెన్నో ఆశలు..నాలుగు దశబ్దాలుగా ఊరిస్తున్న ఈ అంశంపై క్షేత్రస్థాయిలో అడుగులు ముందుకు పడట్లేదు. గతంలో ఇక్కడ పోర్టు ఏర్పాటవుతుందనుకున్నా అది కార్యరూపం దాల్చలేదు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మూలపేటకు తరలిపోయింది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల భావనపాడులో హార్బరు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈనేపథ్యంలో త్వరలో కేంద్ర ప్రతినిధి పరిశీలనకు రానున్నారు. దీంతో ఏళ్లనాటి కల సాకారమవుతుందని మత్స్యకారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

న్యూస్‌టుడే, సంతబొమ్మాళి, టెక్కలి

జిల్లాలో 193 కిలోమీటర్ల సుదీర్ఘమైన తీర ప్రాంతముంది. వేలాదిమంది మత్స్యకారులు సముద్రాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. దొరికిన ఉత్పత్తులను ఒడ్డుకు తెచ్చి విక్రయించడానికి అవకాశం లేక చాలా మంది విశాఖ, ఒడిశా ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి. అక్కడ సరైన ధర లేక అయినకాడికి అమ్ముకుంటున్నారు. హార్బర్ నిర్మాణం జరిగివుంటే పెద్ద పడవలతో వేట సాగించడంతో పాటు ఈ ప్రాంతంలో ఏర్పాటు కానున్న మౌలిక సదుపాయాలతో మత్స్యకారుల ఇక్కట్లు తీరనున్నాయి.

పరిశీలనకు రానున్న కేంద్ర ప్రతినిధి

రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు సూచనలతో మత్స్యశాఖ కమిషనర్ కేంద్రప్రభుత్వ తీరప్రాంత ఇంజినీరింగ్ సంస్థతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపారు. దీని ఆధారంగా భావనపాడులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సాధ్యాసాధ్యాలు పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ ఈనెల 28, 29 తేదీల్లో పరిశీలనకు అధికారిని పంపించనుంది. సీఐసీఈఎఫ్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఎంబీ బెలియప్ప పరిశీలనకు రానున్నారు. అక్కడి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణ ప్రారంభిస్తాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

ఎన్టీఆర్ హయాంలో జెట్టీ నిర్మాణం..

ఎంతో చరిత్ర కలిగిన భావనపాడు తీరంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో జెట్టీ ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏటా దొరికే మత్స్య ఉత్పత్తుల్లో 30 శాతానికి పైగా ఇక్కడే లభిస్తుంది. ఇది మరింత పెరిగేందుకు అవకాశమున్నా సరైన వసతుల్లేక సమస్యగా మారింది. ప్రస్తుతం ఈ రేవు నుంచి ఆటుపోట్లు సమయంలో పడవలు సముద్రంలోకి వెళ్లి, తిరిగి వస్తున్నాయి. హార్బర్ నిర్మాణం జరిగితే నిరంతరం రాకపోకలు సాగించవచ్చు. రేవుకు అనుసంధానంగా ఉన్న ఛానల్ నుంచి సముద్రం వరకు డ్రెజ్జింగ్ చేసి, మళ్లీ పూడకుండా రివిట్‌మెంట్ చేయనున్నారు.

అదనపు వసతులు కల్పిస్తే మేలు..

ప్రస్తుతం భావనపాడు జెట్టీ ప్రాంతంలో 100 బోట్ల వరకు నిలిపేందుకు అవకాశముంది. దానికి అనుగుణంగా మరింత విస్తరణ చేయడంతోపాటు ఓ వైపు భూమి, మరోవైపు నీరు ఉండాలి. అంతర్గత రహదారులు నిర్మించాలి. దొరికిన మత్స్యసంపద ఎగుమతులు చేయడంతో పాటు నిల్వచేసేందుకు శీతల గిడ్డంగులు అందుబాటులోకి రావాలి. వలలు ఎండబెట్టేందుకు ప్రత్యేక ప్రదేశం, మత్స్యకారుల విశ్రాంతి గది, బోటు, వలల మరమ్మతులు చేసుకునే షెడ్లు, భద్రత విభాగం గదులు నిర్మాణం జరిగితే మేలు జరుగుతుంది.

స్థానికంగా ఉంటూ ఆదాయం

భావనపాడులో వెయ్యికిపైగా కుటుంబాలు వేట ఆధారంగానే బతుకుతున్నారు. గత మూడేళ్లుగా ఇక్కడి మత్స్యకారులు గుజరాత్, గోవా, కేరళ, తమిళనాడు, విశాఖ ప్రాంతాలకు వలస వెళ్లి వేట సాగిస్తున్నారు. నెలకు 25 రోజులు సముద్రంలోనే ఉండటం ద్వారా వేటాడిన మత్స్యసంపద పరంగా వచ్చే ఆదాయంలో 20 శాతం మాత్రమే వారికి అందుతుంది. అదే వసతి స్థానికంగా ఉంటే ఖర్చులు పోను కనీసం నెలకు రూ.50 వేల వరకు తెచ్చుకునే అవకాశం ఉంటుందని వారంటున్నారు. జిల్లావ్యాప్తంగా వలస వెళ్తున్న వారు 30 వేల మందికిపైగానే ఉన్నట్లు సమాచారం.

మూణ్నాళ్ల ముచ్చటే..



ఉద్దానంలో ప్రతిష్ఠాత్మక రహదారికి పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనలో భాగంగా బారువ-దట్టి మధ్య రూ.7.50 కోట్ల వ్యయంతో నిర్మించిన రోడ్డు పూర్తిస్థాయి వినియోగంలోకి రాకుండానే మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. పనుల్లో నాణ్యత లోపం కారణంగానే గోతులు ఏర్పడ్డాయని వాహనదారులు విమర్శిస్తున్నారు. సోంపేట మండలం రాజాం పరిధి కేజీబీవీ వద్ద కల్వర్టు సమీపంలో రోడ్డు కుంగిపోయింది. ఇక్కడ వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు నెలకొన్నాయి. ఈ విషయమై పీఆర్ ఏఈఈ ధనుంజయను 'న్యూస్‌టుడే' సంప్రదించగా పీఎంజీఎస్‌వై కింద నిర్మించిన రహదారి నిర్వహణ బాధ్యత ఐదేళ్ల పాటు గుత్తేదారుదేనని స్పష్టం చేశారు. వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, సోంపేట

అదుపు తప్పి..గుంతలో దిగి



ఇచ్ఛాపురం మండలం జగన్నాథపురం మలుపు వద్ద శుక్రవారం ఒడిశాలోని బరంపురం నుంచి వస్తున్న ప్రైవేటు బస్సు గుంతలో దిగింది. ముందు భాగం పైకి లేవడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆ సమయంలో బస్సులో సుమారు 25 మంది ప్రయాణికులు ఉన్నారు. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

నిర్లక్ష్యం వీడుతోంది..!

స్పందనకు వందనం



ఎచ్చెర్ల మండలం పొన్నాడ వంతెన వద్ద ఆర్ ప్లస్ శ్రీ టవర్‌కు పట్టిన పొదలను తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) సిబ్బంది తొలగిస్తున్నారు. టవర్‌కు నిలువునా పొదలు అల్లుకుపోయాయని 'ఈనాడు'లో ఈ నెల 25న 'నిలువెత్తు నిర్లక్ష్యం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆ సంస్థ కార్యనిర్వాహక ఇంజినీరు యోగేశ్వరరావు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం ఏఈ సురేష్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. టవర్ చుట్టూ అల్లుకుపోయిన తీగలను తొలగించే పనులను సిబ్బంది ప్రారంభించారు. పాములు సంచరిస్తుండటం.. టవర్ మధ్య భాగంలో తేనెపట్టు ఉండటంతో సగం వరకు పొదలను తొలగించామని.. రెండు రోజుల్లో పైభాగంలో ఉన్నవి తొలగించి శుభ్రం చేస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, గుజరాతీపేట (శ్రీకాకుళం)

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



పీసీసీ అధ్యక్షురాలు షర్మిలతో సమావేశమైన జిల్లా నాయకులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయి నుంచి చర్యలు చేపట్టాలని.. ప్రతి గ్రామంలో కమిటీలు నియమించి పూర్వవైభవానికి ప్రణాళికాబద్ధ కృషి చేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సూచించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం ఆ పార్టీ జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్-6 పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. అవన్నీ అమలు చేసేలా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పోరాటం చేయాలి' అని షర్మిల శ్రేణులకు సూచించారు. డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, జిల్లా ఇన్‌ఛార్జి గాదం వెంకట త్రినాథరావు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి, మజ్జి త్రినాథ్ బాబు, తెంబూరు మధుసూదనరావు, రెల్ల సురేష్, మామిడి సత్యనారాయణ, బేరి వెంకట్రావు, బస్వా షణ్ముఖరావు, బొత్స వెంకటరమణ, అబోతుల వెంకట నాయుడు, ఇజ్జురోతు రమణ తదితరులు పాల్గొన్నారు.

శాలిహుండం నీటి పథకం పరిశీలన



గార మండలం శాలిహుండంలో మంచినీటి పథకాన్ని శుక్రవారం గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ ఇషాన్ బాషా పరిశీలించారు. నిర్వహణ, ఇతర అంశాలపై సిబ్బందితో మాట్లాడారు. గ్రామాలకు నీరు సరఫరా అవుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఈఈ ఎ.రంగప్రసాద్, డిప్యూటీ ఈఈ లలితకుమారి, క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఈఈ శంకరరావు ఉన్నారు.

- న్యూస్‌టుడే, గార

కంచిలి ఉన్నత పాఠశాలలో 175 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆధార్‌లో పేర్లు, ఇతర వివరాలు తప్పుల తడకగా ఉండటంతో 70 మంది పేర్లు అపార్‌లో నమోదు చేయలేని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా చిరునామా మార్పు తప్ప ఇతర తప్పులు సరిదిద్దడానికి అవకాశం లేక అధికారులను సంప్రదిస్తున్నారు. జనన ధ్రువీకరణ మార్పు పెద్ద సమస్యగా మారడంతో తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు.

సోంపేట ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు 594 మంది విద్యార్థులు చదువుతున్నారు. 300 మందికి సంబంధించి ఆధార్‌లో వివరాలు తప్పుగా ఉన్నాయి. వాటిని సరి చేసిన తరువాతే అపార్ నమోదు చేయాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

కంచిలి మండలం డీజీపురం ఉన్నత పాఠశాలలో 310 మంది విద్యార్థులు చదువుతున్నారు. 200 మందికి పైగా ఆధార్ వివరాల్లో తప్పులు ఉండటంతో అపార్ నమోదు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇక్కడ 77 మంది ఒడియా విద్యార్థుల పేర్లలో తప్పులుండటంతో సరిదిద్దడానికి అవస్థలు పడుతున్నారు. ఒడిశా నుంచి వచ్చి చదువుతున్న తెలుగు విద్యార్థులు 80 మంది వరకు ఉండగా వారి వివరాలన్నీ తప్పులతడకగా ఉన్నాయి. ఆధార్‌లో వాటిని మార్పు చేయడానికి అవకాశం లేకపోవడంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ఒడిశాలో ఆధార్ కేంద్రాలకు వెళ్లి మార్చాలంటే పెద్ద ప్రహసనమే అవుతుందని చెబుతున్నారు.

అక్షరం తప్పు ఉన్నా ఇబ్బందే..!

అపార్ నమోదుకు ఆధార్ గ్రహణం

వివరాలు సరి చేస్తేనే ప్రక్రియ వేగవంతం

న్యూస్‌టుడే, సోంపేట

దేశవ్యాప్తంగా విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదుకు ఆధార్ వివరాలు ఆటంకంగా మారుతున్నాయి. ఆధార్ కార్డులో సమాచారం మేరకే అపార్ జారీ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు సంబంధించిన వివరాలు తప్పుల తడకగా ఉండటంతో ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి సమస్యలు తలెత్తుతున్నాయి. ముందుగా ఆధార్‌లో వివరాలు సరిచేసి తరువాత అపార్ నమోదు చేపట్టాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఒక్కో పాఠశాలలో 20 శాతం కూడా పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది. ఆధార్ వివరాలు మార్చడానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తే తప్ప ఈ ప్రక్రియ సజావుగా సాగదని ఉపాధ్యాయులు, సంబంధిత సిబ్బంది స్పష్టం చేస్తున్నారు.



కంచిలి మండలం పెద్దశ్రీరాంపురంలో అపార్ కోసం వివరాలు నమోదు చేయించుకుంటున్న విద్యార్థి

- నూతన విద్యా విధానం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఒన్ నేషన్ ఒన్ స్టూడెంట్ ఐడీ పేరిట అపార్ జారీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థికి సంబంధించిన పూర్తిస్థాయి సమాచారం నమోదై ఉంటుంది. శాశ్వత డిజిటల్ గుర్తింపు సంఖ్యతో దేశంలో ఎక్కడ చదవాలన్నా.. ఉపాధి అవకాశాలకు సంబంధించి ఈ సంఖ్య కీలకం కాంది. ముఖ్యంగా ధ్రువపత్రాల రక్షణకు అవకాశం ఉంటుంది.
- జిల్లాలో మొదటి విడతలో లక్ష మందికి పైగా విద్యార్థులకు అపార్ జారీ చేయాలని విద్యా శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒకటి నుంచి ఇంటర్ వరకు 2.40 లక్షల మందికి పైగా చదువుతున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల పరంగా కొంతమేర ఇబ్బందులు లేకపోయినప్పటికీ పదో తరగతి వరకు ఆధార్‌లో వివరాలు సరి చేయాలి.

సరళీకృతం చేస్తే మేలు

ఆధార్ వివరాల్లో తప్పులతో అపార్ నమోదుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒడియా విద్యార్థుల పరంగా పేర్లు పలకడం, రాయడంలో తేడా లుంటాయి. ఆధార్‌లో ఒక విధంగా పాఠశాలలో మరోలా పేర్లు ఉండటంతో వాటిని మార్చడం సమస్యగా మారింది. విద్యార్థుల పరంగా ఆధార్‌లో మార్పులకు విధానాన్ని సరళీకృతం చేస్తే మేలు. ప్రధానోపాధ్యాయులకు అవకాశం ఇస్తే కొంత మేర సమస్య పరిష్కారమవుతుంది.

- నయన్‌కుమార్ పండా, జిల్లా ఒడియా ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..

అపార్ నమోదుకు ఆధార్ పరంగా నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. చాలా మందికి ఆధార్ జారీ సమయంలో జనన తేదీ సరిగా నమోదు చేయలేదు. పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదు కావడంతో ఇబ్బందులు నెలకొన్నాయి. వీటిని పరిష్కరించేలా త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

- దుర్గాప్రసాద్, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి, ఇంటర్ విద్యా మండలి

ఇదీ పరిస్థితి

- పాఠశాలలో వివరాలు ఆధార్ సమాచారంతో సరిపోల్చి సరిగా ఉన్నప్పుడే అపార్‌లో నమోదవుతుంది. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, మొబైల్ నంబరు, తలిదండ్రుల పేర్లు, ఆధార్ సంఖ్యలలో ఏది తప్పుగా చూపినా నమోదు కావడం లేదు. పేరులో అక్షరాలు సైతం ఒకేలా ఉంటేనే ఆన్‌లైన్‌లో ముందుకెళ్లడానికి అవకాశం ఉంటుంది.
- పాఠశాల రికార్డుల్లో నమోదైన సమాచారానికి ఆధార్‌లో వివరాలకు పొంతన లేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పుట్టిన తేదీ, పేర్లు, సెల్‌ఫోన్ నంబరు పరంగా ఎక్కువ తప్పులు దొర్లుతున్నాయి. చిరునామా సైతం ఆధార్‌కు పాఠశాల రికార్డులకు తేడా ఉండటంతో ఈ ప్రక్రియ సజావుగా సాగడం లేదు.
- గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ వివరాలు సరి చేయడానికి తల్లిదండ్రులకు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆధార్‌లో పుట్టిన తేదీ సమస్య పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శి నుంచి ధ్రువీకరణ పత్రం ఉంటే తప్ప ఆధార్‌లో మార్పునకు అవకాశం లేదు. గ్రామాల్లో 80 శాతం జనన వివరాలు పంచాయతీ కార్యాలయాల్లో నమోదు చేయడం లేదు. రెవెన్యూ శాఖ జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తేనే ఆధార్‌లో మార్పునకు అవకాశం ఉంటుంది.
- ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల్లో ఎక్కువగా ఒడిశాకు సంబంధించిన ఆధార్ నమోదుతో పాఠశాలల్లో ప్రవేశాలు పొందారు. అక్కడి విద్యార్థుల వివరాలు తప్పులతడకగా ఉండటం, పేర్లు, ఇతర సమాచారంలో వ్యత్యాసం కనిపిస్తుండటంతో అపార్ నమోదు ముందుకు సాగడం లేదు.

ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తిగా వివేక్ ఆనంద్ శ్రీనివాస్

శ్రీకాకుళం లీగల్, న్యూస్‌టుడే: జిల్లా ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి, మూడో అదనపు జిల్లా జడ్జిగా సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్‌ను ఉద్యోగోన్నతిపై నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఆ పోస్టులో పని చేస్తున్న పి.భాస్కరరావును ఒకటో అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేశారు. వివేక్ ఆనంద్ శ్రీనివాస్ రాజాం సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తూ అదనపు జిల్లా జడ్జిగా ఉద్యోగోన్నతి పొందారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

తాను మరణించి ముగ్గురు జీవితాల్లో వెలుగులు నింపి!

- సోంపేట వాసి జీవన్మృతి
- గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాల తరలింపు



గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాలను తరలిస్తున్న పోలీసులు, వైద్య సిబ్బంది

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: ఇంటి పెద్ద మృతి చెందారనే దుఃఖంలో ఉన్నప్పటికీ ఆ కుటుంబ సభ్యులు పెద్ద మనసుతో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపడానికి ముందుకొచ్చారు. సోంపేటకు చెందిన జి.జగదీష్ (41) ఈ నెల 22న ఇంట్లో స్పృహ తప్పి పడిపోయారు. ఆయనను కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి తలలో తీవ్ర రక్తస్రావం అవుతోందని గుర్తించారు. ఆయన్ను రక్షించడానికి మూడు రోజులు శ్రమించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన జీవన్మృతి అయినట్లు తెలిపారు. అవయవదానంపై భార్య, కుమారుడు, కుమార్తె, బంధువులకు అవగాహన కల్పించారు. వారు అంగీకరించిన విషయాన్ని జీవన్‌దాన్ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ కె.రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. జగదీష్ శరీరంలో పని చేస్తున్న అవయవాలను సేకరించడానికి అవసరమైన అనుమతులు జారీ చేశారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలులోని జెమ్స్ ఆసుపత్రిలో మూత్రపిండాలు, ఊపిరితిత్తులు సేకరించారు. వాటిని హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించడానికి విశాఖపట్నం విమానాశ్రయం వరకు పోలీసులు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారు. ఎస్పీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో గ్రామీణ సీఐ పైడపునాయుడు, ఎస్సై రాము, ట్రాఫిక్ సీఐ నాగరాజు బందోబస్తు పర్యవేక్షించారు. జెమ్స్ ఆసుపత్రి వైద్యుల సహకారంతో అంబులెన్స్, పోలీసు ఎస్కార్ట్ వాహనం సిద్ధం చేశారు. సమయానికి విశాఖ విమానాశ్రయానికి చేరుకునేలా మార్గమధ్యలో పోలీసు సిబ్బందిని నియమించారు. కాన్వాయ్ రాగోలు, కొత్తరోడ్డు మీదుగా జాతీయ రహదారిపై సుమారు 130 కిలోమీటర్లు ప్రయాణించి విశాఖ చేరుకుంది.



జగదీష్ (పాత చిత్రం)

గంజాయి తీసుకుంటున్న యువకుల వీడియో చక్కర్లు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న భవనంలో ముగ్గురు యువకులు గంజాయి తీసుకుంటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. గంజాయి రవాణా, వినియోగంపై పోలీసులు నిఘా పెట్టినప్పటికీ ఇటువంటి ఘటనలు అక్కడక్కడా బయటపడుతుండటంతో వారికి సవాలుగా మారింది. గంజాయిని సిగరెట్ల రూపంలో తయారుచేసి వినియోగించేందుకు సిద్ధం చేస్తున్న దృశ్యాలను యువకులు వీడియోలు తీసి స్నేహితులకు పంపడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులు ఆరా తీసి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులతో పాటు సరఫరా చేస్తున్న, ప్రమేయం ఉన్న వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఈ విషయంతమ దృష్టికి రాలేదని.. వీడియో పరిశీలించి విచారిస్తామన్నారు.

27న పలాసలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సదస్సు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: దళితులకు రాజ్యాధికారాన్ని దూరం చేసే లక్ష్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గకరణను తెర పైకి తీసుకొచ్చాయని ఎస్సీ, ఎస్టీ ఐకాస జిల్లా నాయకుడు కె.రాంగోపాల్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రను దళితులందరూ సంఘటితంగా ఎదుర్కోవడానికి పోరాటాలకు సిద్ధం కావాలని వ్యాఖ్యానించారు. వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా.. ఎస్సీ రిజర్వేషన్ల పరిరక్షణలో భాగంగా ఈ నెల 27న పలాస రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. పలాస డివిజన్ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుకు మాజీ ఎంపీ హర్షకుమార్, పలువురు దళిత విశ్రాంత ఉన్నతాధికారులు హాజరవుతారని చెప్పారు.

బాడాంలో బాణసంచా స్వాధీనం



పోలీసులు జప్తు చేసిన సరకు

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నరసన్నపేట మండలం బాడాంలో పెద్ద మొత్తంలో బాణసంచా నిల్వలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు బాడాం గ్రామానికి చెందిన సత్యనారాయణ ఇంట్లో శుక్రవారం రాత్రి ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు నిర్వహించారు. మొత్తం 57 అట్ట పెట్టెలు, 12 గోనె సంచుల్లో సుమారు రూ.2 లక్షలు విలువైన సరకు జప్తు అనంతరం కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. పోలీసులతో పాటు తెలగవలస, ఉర్లాం వీఆర్వోలు పద్మలీల, బూరాడ ప్రసాదరావు ఉన్నారు.

వేధింపుల కేసులో భర్తకు జైలు, జరిమానా

నరసన్నపేట, న్యూస్‌టుడే: భార్యపై వేధింపులకు పాల్పడిన కేసులో భర్తకు జైలు, జరిమానా విధిస్తూ నరసన్నపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హరిప్రియ తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక గాంధీనగర్-1లో నివాసముంటున్న బోనెల సాంబశివరావు, భార్య నాగలక్ష్మిపై వేధింపులకు పాల్పడటంతో 2022 డిసెంబరు 5న నరసన్నపేట పోలీసు స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారణ అనంతరం శుక్రవారం జడ్జి హరిప్రియ తీర్పు చెప్పారు. సాంబశివరావుకు రెండేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధించారు. ఏపీపీ శాంతి సంతోషి వాదించారు.

రేపు వుషూ జిల్లా జట్టు ఎంపికలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో వుషూ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బడి వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల క్రీడా మైదానంలో ఈ నెల 27న అండర్-14, 17, 19 విభాగాల్లో బాల, బాలికలను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ, విద్యార్హత ధృవపత్రాలు తీసుకురావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 94415 69785 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా
(10 AM TO 1 PM)
ఇచ్ఛాపురం : 9440437129
పలాస : 8008574279
కవిటి గ్రామీణం : 8309638875
పలాస గ్రామీణం: 7386408926
కంచిలి గ్రామీణం: 9704568738

సమస్య : ఇచ్ఛాపురం ఆసుపత్రి రోడ్డు నుంచి చిన్నాకులవీధికి వెళ్లే మార్గం ఇబ్బందికరంగా ఉంది. - ఎస్.వినోద్‌కుమార్, ఇచ్ఛాపురం
సమాధానం : పరిశీలించి కౌన్సిల్‌కు నివేదిస్తాం. -ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం
సమస్య: పలాస మండలం మాకన్నపల్లిలో పాఠశాల సమీపంలోని కాలువ శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది - స్థానికులు
సమాధానం: రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం: వైకుంఠరావు, మండల విస్తరణాధికారి, పలాస - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, పలాస గ్రామీణం

మురుగునీటి శుద్ధిప్లాంటుకు స్థల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పురపాలకసంఘ పరిధి 1, 2 వార్డులుగా ఉన్న పురుషోత్తపురంలో మురుగునీటి శుద్ధి కేంద్ర నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించేందుకు శుక్రవారం పలాస ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి పురుషోత్తపురం వచ్చి దస్త్రాలను పరిశీలించారు. స్థల యజమానితో మాట్లాడారు. సాంకేతిక అంశాలపై తహసీల్దారు ఎన్.వెంకటరావు, పుర కమిషనర్ నల్లి రమేష్, ఉపతహసీల్దారు శ్రీహరిబాబులతో చర్చించారు. రత్తకన్నలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించామని కమిషనర్ తెలిపారు. ఉన్నతాధికారులు ఆమోదం అనంతరం సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయ సూచనల మేరకు ధర చెల్లింపు జరుగుతుందని వివరించారు.



విజేతలుగా నిలిచారు



పలాసలోని భాష్యం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఈనాడు ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఇందులో ఎల్.యశ్వంత్ 10వ తరగతి, పి.యశస్వి 9వ తరగతి, కె.వినీత 8వ తరగతి వరుస మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వారికి పాఠశాల ప్రిన్సిపల్ డి.వి.కృష్ణారావు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్ఈఓ శివ, సీఈఓ సత్యం ప్రధానోపాధ్యాయురాలు డి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు జి.రామారావు, గోపాలకృష్ణ, ఎన్.రాజశేఖర్, కె.మల్లేశ్వరరావు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పలాస

చిన్నారులు ఆడుకునేదెక్కడ?

సోంపేట పిల్లల పార్కుకు వీడని గ్రహణం

న్యూస్‌టుడే, సోంపేట

సోంపేటలో పిల్లల ఉద్యానం ఏర్పాటుకు దశాబ్దం కిందట అడుగులు పడినా పనులు ముందుకు సాగకపోవడంతో ఏళ్లుగా ఆ స్థలం నిరుపయోగంగా ఉంది. 20 ఏళ్ల కిందట వరకు ఇక్కడ రెండు పార్కులుండగా ప్రస్తుతం ఒకటైనా ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో స్థానికులు ఆహ్లాదానికి దూరమయ్యారు. వివిధ అవసరాల పేరిట ఉన్న ఉద్యానాలను ధ్వంసం చేసి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు అధికారులు నీళ్లు నమిలే పరిస్థితి ఏర్పడటంపై స్థానికులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.


పార్కు చుట్టూ నిర్మించిన గోడ

ప్రహరీకే పరిమితం....

చిన్నారుల పార్కు ఏర్పాటు కోసం ఎనిమిదేళ్ల కిందట అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఎకరా స్థలంలో పనులు ప్రారంభించారు. తెదేపా హయాంలో రూ.15 లక్షల వరకు నిధులు వెచ్చించి అప్పటి ఎమ్మెల్యే బెందాళం అశోక్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వం మారడంతో ఈ పనులు ముందుకు సాగక.. కేవలం ప్రహరీ గోడలకే పరిమితమైంది. ఆ స్థలం మందుబాబులకు అడ్డాగా మారింది. చదంబాలచెరువు, పోలీసు చెరువులను కూడా సేద తీరేమార్గాలుగా ఏర్పాటు చేసేందుకు గతంలో నిర్ణయం తీసుకున్నారు. పోలీసు చెరువు అభివృద్ధికి అప్పటి కలెక్టర్ లక్ష్మీనరసింహ రూ.26లక్షల నిధులు కేటాయించినా పనులు చేపట్టలేదు. ఈరెండు చెరువుగట్లపై మొక్కలు పెంచి, బల్లలు ఏర్పాటు చేయడంతో పాటు రన్నింగ్, వాకింగ్‌ట్రాక్‌ల ఏర్పాటు చేయాలని ప్రతిప్రాదనలు చేసి వదిలేశారు.

మురికి కూపంగా మారాయి..

స్థానిక బాలికోన్నతపాఠశాల పరిధిలో పంచాయతీ, కవిటిరోడ్డులో ఇండిపెండెన్స్‌డే పార్కులుండేవి. ఇక్కడ గ్రంథలయాలు కూడా నిర్వహించేవారు. సోంపేట ప్రజలతో పాటు ఉద్దానం గ్రామాల ప్రజలు ముఖ్యంగా విద్యార్థులకు రెండు పార్కులు ఎంతగానో ఉపయోగపడేవి. దశాబ్ద కాలంగా రెండు ఉద్యానాల నిర్వహణను విస్మరించడంతో అవి మురుగుకూపంగా మారుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ సచివాలయం, రైతుసేవా కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టి అక్కడున్న నిర్మాణాలు తొలగించడంతో స్థానికులు ఆశలు వదులుకున్నారు.

ఉద్యానం ఏర్పాటుకు సాయం... పిల్లల పార్కులో పనులు చేసేందుకు అప్పట్లో ప్రయత్నించినప్పటికీ అధికారులు సహకరించలేదు. ప్రస్తుతం పనులు చేపట్టేందుకు అవకాశం ఇస్తే కొంత మేర సాయం అందించేందుక సిద్ధంగా ఉన్నాను.
- దుద్ది శ్రీనివాసరావు, వ్యవస్థాపకుడు ఎస్ఎస్‌సేవా ఫౌండేషన్, సోంపేట

అధికారులతో చర్చించి నిర్ణయం.. సోంపేట చిన్న పిల్లల పార్కు పూర్తి చేయడంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల విషయమై అధికారులతో చర్చిస్తాం. స్వచ్ఛంద సంస్థలతో కూడా మాట్లాడి.. వీలైనంత వేగంగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.
- బెందాళం అశోక్ ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం


ఆక్రమణలతో అధ్వానంగా మారిన పోలీసు చెరువు

గుంతల దారిలో అవస్థలు



పలాస మండలం గంగువాడలోని ఎస్సీ వీధి సమీపంలో రోడ్డుపై భారీ గుంత ఏర్పడటంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా గోతుల నిండా నీరు నిల్వ ఉండిపోతోందని, దాని కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇదే విషయం ఆర్అండ్‌బీ ఏఈఈ విక్రమ్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.
- న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

రంగులు వేయరూ..

మందస మండలం పొత్తంగి-సిరిపురం ఉన్నత పాఠశాలలో గతంలో రెండో విడత నాడు-నేడు ద్వారా అదనపు భవనం నిర్మించారు. పనులు పూర్తయి ఏడాది కావొస్తున్న ఇంత వరకు వాటికి రంగులు వేయలేదు. తరగతి గదుల్లో విద్యుదీకరణ పనులు చేపట్టలేదు. వసతి సమస్య ఉండటంతో ఈ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు చందాలు వేసుకుని గదుల్లో విద్యుత్తు పంకాలు ఏర్పాటు చేశారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తారకేశ్వరరావును వివరణ కోరగా గుత్తేదారుడితో మాట్లాడి రంగులు వేయిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, మందస



రేకుల షెడ్‌లో అంగన్‌వాడీ కేంద్రం



మందస ఆర్టీజన్ కాలనీకి ఆనుకుని ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన గదిలో అద్దెకు అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. రేకుల షెడ్ కావడంతో ఎండ సమయంలో చిన్నారులు విలవిలలాడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సురక్షితమైన భవనంలోకి కేంద్రాన్ని తరలించాలని కోరుతున్నారు. ఈ విషయంపై సీడీపీఓ వసుందరాదేవి మాట్లాడుతూ..వీలైనంత వేగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తరలిస్తామన్నారు.
- న్యూస్‌టుడే, మందస

అధ్వాన మార్గం

ఇచ్ఛాపురం పట్టణ పాత జాతీయరహదారి నుంచి ముత్యాలమ్మగుడి మీదుగా దానంపేటకు వెళ్లే రహదారి మార్గం పరిస్థితి అధ్వానంగా ఉంది. కాలువపై అమర్చిన సిమెంటు పలకలు కొంత మేర దెబ్బతినగా, వాటికి అనుసంధానంగా వేసిన రహదారి కూడా ధ్వంసమయ్యింది. వాహనదారులు, పాదచారులు సైతం అటుగా వెళ్లడానికి ఇక్కట్లు పడుతున్నారు. ఈ విషయంపై ఇటీవల కురిసిన వర్షానికి అనుసంధాన దారి మరమ్మతుకు గురైంది. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్ రమేష్ తెలిపారు.
-న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



బావుల్లో క్లోరినేషన్ పనులు

స్పందనకు వందనం

పురపాలక సంఘం పరిధిలోని అన్నపూర్ణ ఆశ్రమం ప్రాంతంలో సమస్యలపై 'కష్టాలతో సహవాసం' పేరిట శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై పురపాలక అధికారులు స్పందించారు. పురపాలక శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో కాపువీధి పరిసర ప్రాంతాల్లోని బావుల్లో క్లోరినేషన్ పనులు చేపట్టారు. కాలువల్లో పూడికలు తొలగించి మురుగు నిల్వలేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. కమిషనర్ ఎన్.రామారావు, శానిటరీ అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, పలాస



డిమాండ్ల సాధనకు సిద్ధమవ్వాలి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: తమ డిమాండ్ల సాధనకు ఉద్యోగులంతా పోరాటాలకు సిద్ధమవ్వాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం (ఏఐజీడీఎస్‌యూ) జిల్లా ప్రతినిధులు ఎన్.నందీశ్వరరావు, బి.తినేష్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు కాశీబుగ్గ తపాలా కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. డిమాండ్ల సాధన కోసం దశలవారీగా పోరాటం చేసేందుకు వచ్చే నెల 12, 13 తేదీల్లో దిల్లీలో జరిగే హంగర్ ఫాస్ట్‌లో పాల్గొనాలని కోరారు. ఏపీఈఈ క్లాస్ త్రి ప్రతినిధులు కె.రాము, మోహనరావు, సతీష్ ఉద్యోగులు పాల్గొన్నారు.


కాశీబుగ్గ తపాలా కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

అమరవీరులకు నివాళి కనీస బాధ్యత


వాహనానికి పోలీస్ ఫ్లాగ్‌డే స్టిక్కర్లను అతికిస్తున్న జోహర్‌ఖాన్

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: సమాజం, ప్రజల రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించడం ప్రజల కనీస బాధ్యతని జ్ఞానభారతి కార్యదర్శి జోహర్‌ఖాన్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ద్విచక్ర వాహనాలకు పోలీస్ ఫ్లాగ్‌డే స్టిక్కర్లను అతికించే కార్యక్రమాన్ని చేపట్టారు. డబ్బూరివీధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రషీదా సుల్తానా, సయ్యద్ సుల్తానా, అలీమ్‌ఖాన్, ఐబీ పండా, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం


నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఏజెంట్లు

సోంపేట, న్యూస్‌టుడే: ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, కొందరు ఉద్యోగులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు ఏజెంట్లు సమాయత్తం కావాలని ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. సోంపేటలో శుక్రవారం పలాస డివిజన్ సంఘ సమావేశం నిర్వహించి పలు సమస్యలను చర్చించారు. యూనియన్ ప్రతినిధులు రాజేంద్రనాయుడు, కోదండరావు, ప్రకాష్, డిల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, చిన్నారావు, సీనియర్ ఏజెంట్లు పాల్గొన్నారు.

అయోడిన్ అవసరం


ప్రశంసా పత్రాలతో విజేతలు, ఉపాధ్యాయులు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: అయోడిన్ లోప రుగ్మత నివారణ వారోత్సవాల్లో భాగంగా పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అయోడిన్ ప్రాధాన్యత అనే అంశంపై విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడారు. అయోడిన్ లోపం వల్ల మెదడు ఎదుగుదల, జ్ఞాపకశక్తి మందగిస్తుందని విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు రమణారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయం లాభసాటిగా మారాలంటే రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని పలాస ఏపీఎం జాంబవతి అన్నారు. పంటలలో ఎరువుల వాడకాన్ని, పెట్టుబడి తగ్గించి, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలనే పండించాలని సూచించారు. పలాస మండల మహిళా సమాఖ్య భవనంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులకు పంటలు పండించే విధానాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ అనుబంధంగా ఉన్న ప్రభుత్వ పథకాలు ఎలా వినియోగించుకోవాలి అనే అంశంపై మహిళలకు సలహాలు ఇచ్చారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనా పోటీలు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలు, వాటిపట్ల ప్రజలు పాటించాల్సిన అప్రమత్తతపై విద్యార్థుల అవగాహన స్థాయిని గుర్తించేందుకు ఈ పోటీలు దోహద పడతాయని ఇచ్ఛాపురం పట్టణ ఎస్సై ఇ.చిన్నంనాయుడు తెలిపారు. సీఐ ఎం.చిన్నంనాయుడు ఆదేశాల మేరకు పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో వ్యాసరచన పోటీ, పురుషోత్తపురం పుర ఉన్నత పాఠశాలలో వక్తృత్వ పోటీలను నిర్వహించినట్లు పేర్కొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు వజ్రపుకొత్తూరు మండలం, మెట్టూరు గ్రామ కాపురం, కొండప్ప గణపతి గారి భార్య శ్రీమతి వరలక్ష్మి గారి భోగట్టాపై యావన్మందికి ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా!

ఈ దిగువ షెడ్యూల్‌లో వివరించిన ఆస్థి నా క్లయింటు స్వాధీన, హక్కు అనుభవంలో యున్నది. సదరాస్తికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ తేది: 25-03-2000 గల కాశీబుగ్గ సబ్-రిజస్ట్రార్ ఆఫీసు దస్తావేజు నెం. 448/2000 గల రిజిస్టర్డ్ సెటిల్‌మెంట్ దస్తావేజు ఒరిజినల్‌ను ఆమె తేది: 24-10-2024 ఉదయం 10.00 గం॥ల సమయంలో కాశీబుగ్గ బస్టాండ్ వద్ద పోగొట్టికొనినారు. సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల వారు సదరు దస్తావేజును నా క్లయింటుకు అందజేయవలసిందిగా కోరడమైనది. సదరాస్తిని బ్యాంకులలో తాకట్టుపెట్టుటకు నా క్లయింటు ప్రతిపాదించి యున్నారు. కావున సదరాస్థిపై వేరెవరికైనా యెట్టి హక్కు గాని, ఆసక్తి గాని ఉన్న యెడల అట్టి వారు ఈ నోటీసు ప్రచురించబడిన ఏడు దినములలోగా వారి యొక్క ఆక్షేపణలను నాకు తెలియజేయవలెను. లేని యెడల సదరాస్తిపై వేరెవరికీ యెట్టి హక్కులు లేవనియున్నూ మరియు సదరాస్తిని నా క్లయింటు తాకట్టు పెట్టుటకు ఎవ్వరికి యెట్టి అభ్యంతరములు లేవనియున్నూ భావించబడునని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్: శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటి, కాశీబుగ్గ పట్టణం, లలితానగర్ దరి, తిలక్‌నగర్‌లో సర్వే నెం. 230/4, డోర్ నెం: 1-6-899/e, అసెస్‌మెంట్ నెం: 1084001179 గల తూ॥ప॥లకు 29 అడుగులు, ఉ॥ద॥లకు 37 అడుగులు అనగా 119.22 చ॥గ॥ల స్థలంలో నిర్మించబడిన డాబా ఇంటికి హద్దులు: తూ॥ రోడ్డు, ద॥ రోడ్డు, ప॥ మల్లా సూర్యనారాయణ గుప్తా గారి ఇల్లు, ఉ॥ పెంట శ్రీరామమూర్తి గారి ఇల్లు.

రత్నాల శ్రీనివాసరావు B.Com.,D.P.M.,B.L,
అడ్వకేట్, గాంధీనగర్ -2, పలాస - 532221. సెల్: 9490557171

సంక్షిప్త సమాచారం

రీ సర్వే తప్పులు సరిచేస్తాం

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో నిర్వహించిన భూముల రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేస్తామని డిప్యూటీ తహసీల్దార్ సునంద అన్నారు. పలాస మండలం కేశుపురం శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు.

కళలతో మానసికోల్లాసం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: మానసిక ఉల్లాసాన్ని, శారీరకంగా ఆరోగ్యాన్ని అందించేవే కళలు అని, ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక కళ ఉంటుందని శాంతినికేతన్ అధ్యక్షుడు దక్కత కృష్ణమూర్తిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ కళాకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతినికేతన్ విద్యాలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, వారికి జ్ఞాపికతో పాటు, ప్రశంసా పత్రాలు అందించారు. మేనేజర్ కేసీ పూరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చొట్రాయిపురం ఎంపీపీ పాఠశాలను ఎంఈవోలు తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల విద్యాశాఖ అధికారులు శివరాంప్రసాద్, చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు పాల్గొన్నారు.



పశుగణన ప్రారంభం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బెజ్జపుట్టగలో అఖిల భారత పశు గణనను పశువైద్యాధికారి కిరణ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఏహెచ్ఏ నీలవేణి మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ వరకు పశు గణన చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు వద్ద ఉన్న ఆవులు గేదెలు, మేకలు, గొర్రెలు, పందులు, గుర్రాలు, కోళ్లు, పలు రకాల పక్షులు, 16 రకాల పెంపుడు జంతువులు సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. జడ్పీటీసీ మాజీ సభ్యులు పొందల కృష్ణారావు, వీఆర్వో బాలకృష్ణ, రైతులు నారాయణమూర్తి, ప్రవీణ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

మెమూ రైలు శ్రీకాకుళం వరకు పొడిగించండి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: భువనేశ్వర్-పలాస మెమూ రైలు (08443, 08444)ను శ్రీకాకుళం రోడ్డు రైలు నిలయం వరకూ పొడిగించాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రైల్వే జీఎంకు వినతిపత్రాన్ని పంపించినట్లు జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు కె.సూర్యప్రకాశ్ తెలిపారు. జిల్లా కేంద్రం శ్రీకాకుళంతో పాటు ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి ప్రాంతాల వారు నిత్యం బ్రహ్మపుర, పలాస, ఇచ్ఛాపురం పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వందలాది మంది ప్రయాణికులకు అందుబాటులో ఉండేందుకు మెము రైలును పొడిగించాలని కోరినట్లు పేర్కొన్నారు.

టెక్కలి

• టెక్కలి • నరసన్నపేట • పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

? నందిగాం మండలం ఆనందపురం పంచాయతీ మాదిగాపురం కొస, మధ్య వీధుల్లోని కాలువల్లో మురుగు పేరుకుపోయింది. దుర్గంధం, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించాలి.
– రామారావు, స్థానికుడు

● క్షేత్రస్థాయిలో పరిశీలించి, పారిశుద్ధ్య సిబ్బందికి తెలియజేస్తాం. కాలువలను శుభ్రం చేయించి, అవస్థలు తీరుస్తాం. – కొక్కిరి రవి, పంచాయతీ కార్యదర్శి, ఆనందపురం

– న్యూస్‌టుడే, నందిగాం

నిర్లక్ష్యంగా పనిచేస్తే చర్యలు

ప్రభుత్వ వసతిగృహాలను సక్రమంగా నిర్వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కొత్తూరు కోర్టు జడ్జి ఎస్.మణి అన్నారు. మండలంలోని వసప కేజీబీవీ వసతిగృహాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. సమస్యల గురించి సిబ్బందిని, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, ఆట స్థలం లేకపోవడంతో పాటు, ఇతర సమస్యలను గుర్తించారు. వీటిపై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, కొత్తూరు







అపజయాలకు కుంగిపోవద్దు

గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, అపజయాలకు కుంగిపోవద్దని టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దాసరి నాగభూషణం విద్యార్థులకు సూచించారు. శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లింగుబారి చందు (పదో తరగతి), కోనారి ప్రదీప్ (తొమ్మిదో తరగతి), తోపల మదన్‌కుమార్ (పదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం



సమావేశానికి హాజరైన తెదేపా నాయకులు, కార్యకర్తలు

ఎన్నికల ముందు వచ్చిన వారికే అవకాశం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతీ ఒక్కరూ తెదేపాలోకి వస్తారని కానీ ఎన్నికల ముందు వచ్చిన వారికే అవకాశం ఉంటుందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కోటబొమ్మాళిలో శుక్రవారం టెక్కలి నియోజకవర్గ స్థాయి నేతలు, కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలకు పార్టీ ఇస్తున్న గౌరవం, బీమా సౌకర్యాలు కష్టపడిన వారికే దక్కుతాయన్నారు. సభ్యత్వ కార్యక్రమంలో రాష్ట్రంలోనే నియోజకవర్గం ప్రథమస్థానంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.ఎల్.నాయుడు, గోవిందరాజులు, కింజరాపు హరివరప్రసాద్, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం మండల అధ్యక్షులు బోయిన రమేష్, భీమారావు, బగాది శేషు, అజయ్‌కుమార్, మాజీ ఎంపీపీలు రామకృష్ణ, విజయలక్ష్మి, పురుషోత్తం పాల్గొన్నారు.

గుమ్మగెడ్డకు గండ్లు గండం

● ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
● కాలువ పరివాహక ప్రాంత రైతుల ఇక్కట్లు

న్యూస్‌టుడే, పాతపట్నం

ఆంధ్ర- ఒడిశాను అనుసంధానం చేస్తూ ప్రవహిస్తుంది గుమ్మగెడ్డ. ఒడిశా ప్రాంతం పర్లాఖెముండిలో ప్రారంభమై పాతపట్నం మండలం ఎ.ఎస్.కవిటిలో ఆంధ్రాలోకి ప్రవేశిస్తుంది. చాకిపల్లి, రొంపివలస, సీది తదితర గ్రామాల మీదుగా సుమారు 12 కిలోమీటర్లు ప్రవహిస్తూ వేల ఎకరాల వరి సాగుకు ఆధారంగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన నీటి వనరు గత ఏడు సంవత్సరాలుగా కనీసం మరమ్మతులకు నోచుకోక పోవడంతో పరివాహక ప్రాంత రైతులు ఏటా తీవ్ర నష్టాన్ని చవి చూస్తున్నారు. గండ్లు పడి ఏళ్లు గడుస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోక పోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. అధిక వర్షాల సమయంలో పంటలు ముంపునకు గురవుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తాత్కాలిక మరమ్మతులు చేసుకుంటున్నామని, ప్రభుత్వం స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



నెల రోజుల క్రితం కొట్టకుపోయిన గుమ్మగెడ్డ గట్టు

ఇదీ పరిస్థితి..

ఒడిశా ప్రాంతంలో వెడల్పుగా ఉన్న గెడ్డ ఆంధ్ర ప్రాంతంలో నిడివి, లోతు తగ్గిపోవడంతో తరచూ ఎ.ఎస్.కవిటి వద్ద గండ్లు పడుతున్నాయి. కాలువకు సమీపంలో ఉన్న పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. పరివాహక గ్రామాల వద్ద కాలువ వెడల్పు, లోతు పెంచాలి. పలు చోట్ల చప్టాలను నిర్మించి, ఆక్రమణలు పూర్తి స్థాయిలో తొలగించాలని రైతులు కోరుతున్నారు.



ఎ.ఎస్.కవిటి వద్ద వెడల్పుగా ఉన్న నీటి వనరు

అభివృద్ధి చేయాలి



పాతపట్నం మండలంలో సుమారు ఆరు పంచాయతీల పరిధిలోని వందల ఎకరాలకు సాగునీటిని అందించే వనరు గుమ్మగెడ్డ. గత కొంత కాలంగా అభివృద్ధి చేయక పోవడంతో పలుచోట్ల గండ్లు పడ్డాయి. మరికొన్ని చోట్ల పూడికలతో నిండిపోయింది. ప్రభుత్వం స్పందించి అభివృద్ధి చేయాలి.
– సంజీవరావు, రైతు, ఎ.ఎస్.కవిటి

చర్యలు తీసుకుంటాం

గుమ్మగెడ్డకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.
– జి.వి.రమణ, జేఈ, నీటి పారుదల శాఖ, పాతపట్నం

ఎందుకు ఏర్పాటు చేశారు..?



పోలాకి మండలం డోల గ్రామంలో జగనన్న కాలనీలో రైతుసేవా కేంద్రం ఆవరణలో పశువుల తనిఖీకి ఉపయోగించే ట్రావిస్‌ను ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా ఎటువంటి ఉపయోగం లేకుండా ఇది నిరుపయోగంగా మారింది. తుప్పు పట్టి పాడవక ముందే వేరే చోటకు తరలించి, వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయాన్ని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు నారాయణరావు వద్ద ప్రస్తావించగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పోలాకి

పేరుకు పోయినా పట్టించుకోరా

టెక్కలిలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. సోగ్గాడిపేట, గందరగోళ వీధి ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకు పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు మాట్లాడుతూ.. ఆ ప్రాంతాల్లో రెండు రోజుల క్రితమే పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టామన్నారు. చెత్త బండి వచ్చేటప్పుడు వ్యర్థాలు ఇవ్వాలని చెబుతున్నా స్థానికుల్లో చైతన్యం కొరవడిందన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి



సారూ కొంచెం ఇటు చూడరూ



జాతీయ రహదారిపై టెక్కలి- శ్రీకాకుళం మార్గంలో కోటబొమ్మాళి సమీపంలోని పొలాల్లో పలు విద్యుత్తు స్తంభాలకు పనికిరాని మొక్కలు అల్లుకున్నాయి. రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం ఆయా ప్రాంతాలకు వస్తుంటారు. ఈదురు గాలులు వీచి ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ ఏఈ జీవీ సురేష్‌కుమార్‌ను వివరణ కోరగా.. సిబ్బందికి తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

రాళ్లు తేలి.. అధ్వానంగా మారి

సంతబొమ్మాళి- డీపీఎన్ రహదారి రాళ్లు తేలి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు చేసేందుకు వాహనచోదకులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వం ఈ రోడ్డును పట్టించుకోక పోవడం, నిత్యం పోర్టు వాహనాలు ప్రయాణిస్తుండటంతో ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు వాపోతున్నారు. ఈ విషయమై కోటబొమ్మాళి ఆర్అండ్‌బీ జేఈ హరనాథ్ మాట్లాడుతూ.. ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే రహదారిని మెరుగు పరుస్తామన్నారు.
– న్యూస్‌టుడే, సంతబొమ్మాళి



విద్యుత్తు తీగలు సరి చేశారు

స్పందనకు వందనం

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నరసన్నపేట మండలం ఉర్లాం సాయివీధి శివారులో విద్యుత్తు తీగలు చేతికి అందినంత ఎత్తులో ప్రమాదకరంగా ఉండటంతో పలువురు భయాందోళన వ్యక్తం చేసేవారు. సమస్యపై 'విద్యుత్తు తీగలు సరిచేయరూ' శీర్షికతో శుక్రవారం ఈనాడులో వార్త ప్రచురితం కావడంతో ఉర్లాం విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ బాలకృష్ణ స్పందించారు. సిబ్బందితో తీగలను సరి చేయించారు.

మంత్రి వితరణ జమ

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లి దేవస్థానంలో నిత్యాన్నదానానికి రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు 2016 ఆగస్టు 27న అందించిన రూ.లక్షను ఎట్టకేలకు సదరు ఖాతాలో అధికారులు శుక్రవారం జమచేశారు. భక్తులు నిత్యాన్నదానానికి సమర్పించిన వితరణలపై 'విరాళాలేమయ్యాయ్' శీర్షికతో ఈనెల 21న ఈనాడులో కథనం వెలువడిన సంగతి తెలిసిందే. వీటన్నింటిపై దేవాదాయ ధర్మదాయ శాఖ సోంపేట ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ విచారణ చేపట్టి, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.

పంకాల వితరణ

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జ్యోతీరావు పులే పాఠశాలకు తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు ఉర్జాన కొండలరావు, ఉపాధ్యక్షుడు ఈశ్వరి, సభ్యులు, తల్లిదండ్రులు శుక్రవారం ఐదు పంకాలు వితరణగా అందించారు. రూ.20 వేలతో విద్యుత్తు పనులు చేయించారు.

ఇసుక లారీలతో ఆందోళన

హిరమండలం: ఇసుక లారీలు అతి వేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గులుమూరు, కొండరాగోలు, దుర్బలాపురం గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కొత్తూరు మండలం ఆకులతంపర వద్ద వంశధార నదిలో ఇసుక ర్యాంపు ఇటీవల ప్రారంభించారని, అక్కడ నుంచి లారీలు ఇసుకతో వచ్చే సమయంలో గ్రామాల్లో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వాహనాలు నెమ్మదిగా వెళ్లాలని డ్రైవర్లకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హనుమంతరావు, ఎస్సై ఎండీ యాసిన్ పేర్కొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

కొత్తూరు: క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని, విద్యార్థులకు ఇది అవసరమని నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణారావు, భామిని ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్ అన్నారు. నివగాం కళాశాలలో విద్యార్థుల స్వాగత సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తుకు పునాది ఈ దశలోనే వేసుకోవాలని సూచించారు. అనంతరం బదిలీపై వెళ్లిన ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్‌ను సన్మానించారు.

సభ్యత్వంతో కుటుంబానికి భరోసా

హిరమండలం: తెదేపా సభ్యత్వం తీసుకున్న వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా కలుగుతుందని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, తెదేపా మండల అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం వారు తెదేపా నాయకులతో కలిసి హిరమండలంలో మాట్లాడారు. శనివారం నుంచి (ఈనెల 26) గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆలయంలో బారికేడ్లు ఏర్పాటు

జలుమూరు: శ్రీముఖలింగేశ్వరస్వామి క్షేత్రంలో వచ్చే నెల 2 నుంచి జరిగే కార్తీక మాసం ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో బారికేడ్ల ఏర్పాట్లును ఈవో పి.ప్రభాకరరావు పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ప్రగతికి నైపుణ్యం అవసరం

నరసన్నపేట: విద్యార్థులు ప్రగతి సాధించేందుకు నైపుణ్యం అవసరమని అంబేడ్కర్ విశ్వవిద్యాలయం బీసీడీఈ సమన్వయకర్త ప్రొఫెసర్ అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యశాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రగతికి విద్యార్థుల నైపుణ్యం కీలకమన్నారు. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి



కొత్తూరు, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని సీతంపేట ఐటీడీఏ డిప్యూటీ డీఈవో పి.నారాయుడు అన్నారు. మండలంలోని గొట్టిపల్లి గిరిజన సంక్షేమ వసతిగృహాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వంటగది, తరగతి గదులను పరిశీలించారు. మెనూ అమలు తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏఎంవో పి.కోటిబాబు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాధాకాంత గోవిందుని సేవలో ఎమ్మెల్సీ



మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ శుక్రవారం మెళియాపుట్టిలోని రాధాకాంత గోవింద స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు గోపీనాథ్ రతో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మండలంలో కొసమాల, చాపర, పెద్దపద్మాపురం, నేలబొంతు, బందపల్లి తదితర ఉన్నత పాఠశాలలను రఘువర్మ పరిశీలించి ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకున్నారు. విద్యారంగం సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల హక్కులు సాధనకు సమష్టి పోరాటాలు అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు జె.ధర్మారావు, కామేశ్వరరావు, బి.ఢిల్లీశ్వరరావు, ఎల్.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఎల్‌ఎన్‌పేట, న్యూస్‌టుడే: కరకవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డి.ప్రతాప్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న మందులు అందించారు. తీవ్రత ఎక్కువ ఉన్న వారికి కళ్ల అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాలక రామారావు, సర్పంచి యోగీశ్వరరావు, వైద్య సిబ్బంది కిరణ్‌కుమార్, కామేశ్వరి పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

నరసన్నపేట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల వద్ద నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ సూచించారు. నరసన్నపేటలోని బండి వీధి, పెద్దపేట, హడ్కోకాలనీ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. జిల్లాలో రూ.2.8కోట్లతో 1,059 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. పీవో నాగమణి, సూపర్‌వైజర్ రమణమ్మ పాల్గొన్నారు.



బండివీధి అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న శాంతిశ్రీ

బాధితుడికి చెక్కు అందజేత



పోలాకి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గజపతినగరం గ్రామస్థుడు కోల ఎర్రన్నాయుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.51,309 మంజూరు చేశారు. ఈ చెక్కును శుక్రవారం కత్తిరివానిపేటలోని క్యాంపు కార్యాలయంలో బాధితుడికి ఎమ్మెల్యే అందజేశారు.

వెంకటరమణకు మంత్రి అభినందన



సారవకోట, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: సారవకోట మండల తెదేపా అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణను రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని తన కార్యాలయంలో అభినందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడాన్ని మంత్రి గుర్తించారు. భవిష్యత్తులో వెంకటరమణకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

విద్యుత్తు ఉపకరణాలు కాలిపోతున్నాయ్

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరాలో వ్యత్యాసాలతో ఉపకరణాలు కాలిపోతున్నాయని, అధికారులు స్పందించి ఇబ్బందులు తొలగించాలని బాలసీమ గ్రామస్థులు కోరుతున్నారు. గత నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన ఆరంగి వెంకటరమణ, జనార్దనరావు, శ్రీనివాసరావుల ఇన్వర్టర్లు కాలిపోయాయి. ఈ విషయాన్ని విద్యుత్తు శాఖ ఏడీ ఇందిర దృష్టికి తీసుకెళ్లగా స్పందించి శుక్రవారం సాయంత్రానికి సమస్యను పరిష్కరించారు.

గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించాలి

నరసన్నపేట, న్యూస్‌టుడే: రక్తహీనత కలిగిన గర్భిణులను గుర్తించి వైద్య సేవలందించాలని ఫ్యామిలీ డాక్టర్ పథకం జిల్లా నోడల్ అధికారి శ్రీకాంత్ సూచించారు. తామరాపల్లి గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. రక్తహీనత కలిగిన గర్భిణులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించాలన్నారు. క్షయ, కుష్ఠు వ్యాధిగ్రస్థుల పట్ల నిర్లక్ష్యం వద్దని సిబ్బందికి సూచించారు. డిప్యూటీ పారామెడికల్ అధికారి సురేష్‌కుమార్, లక్ష్మణరావు, పద్మరాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేషధారణలు



ఎల్‌ఎన్‌పేట, న్యూస్‌టుడే: మండలంలో నందెన్న ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. రావిచెంద్రి గ్రామంలో విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలో యువత ప్రత్యేక వేషధారణలో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం అన్నదానం చేపట్టారు.

నెలాఖరుకు పనులు పూర్తి చేయండి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ఏకలవ్య ఆదర్శ గిరిజన పాఠశాల భవన నిర్మాణ పనులు ఈ నెలాఖరుకు పూర్తిచేయాలని ఐటీడీఏ సీతంపేట ఏపీవో చిన్నబాబు తెలిపారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన ఏకలవ్య నిర్మాణ పనులు పరిశీలించి సిబ్బందికి, గుత్తేదారుకు పలు సూచనలు చేశారు. అనంతరం బందపల్లి, పెద్దలక్ష్మీపురం గిరిజన బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పనికి రానివారికి హాజరు

సారవకోట, న్యూస్‌టుడే: గొర్రిబంద పంచాయతీలో ఉపాధి పనులకు రాని 9 మందికి క్షేత్ర సహాయకుడు హాజరు వేసి నిధులు దుర్వినియోగం చేశారని స్థానికులు ఫిర్యాదు చేసినట్లు డీఆర్పీ సురేష్ వెల్లడించారు. ఈమేరకు సచివాలయం ఆవరణలో శుక్రవారం జరిగిన సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. కిడిమి పంచాయతీలో గత ఐదు సంవత్సరాలుగా క్షేత్రసహాయకుడు లేక ఇబ్బందులు తప్పడంలేదని స్థానిక సర్పంచి చిరంజీవరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సార్పీలు పున్నపునాయుడు, తిరుపతిరావు, స్థానిక సర్పంచులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం
•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

3, 4 తేదీల్లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో వచ్చే నెల 3, 4 తేదీల్లో అండర్-14, 17, 19 బాల బాలికల విభాగాల్లో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, వుషూ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు, డీఈవో ఎస్. తిరుమలచైతన్య, కార్యదర్శి బడి వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో అథ్లెటిక్స్ పోటీలు, కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో వుషూ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి సుమారు 1,200 మంది క్రీడాకారులు, కోచ్ మేనేజర్లు, వ్యాయామోపాధ్యాయులు హాజరవుతారని తెలిపారు.

సమస్యల పరిష్కారంలో వైకాపా ప్రభుత్వం విఫలం

గార, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో వైకాపా ప్రభుత్వం విఫలమైందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార తహసీల్దారు కార్యాలయం ఆవరణలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంపీడీవో రామ్మోహనరావు, తహసీల్దారు రమణారావు, పలువురు అధికారులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్



పోటీ పడ్డారు..ప్రతిభ చాటారు



శ్రీకాకుళం నగరం మహాలక్ష్మీనగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అంతర్జాల వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. టి.అక్షయ (9వ తరగతి), కె. సోహిత (9వ తరగతి), బి.అక్షయిని (9వ తరగతి) వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ ఆర్.రామ్‌ప్రసాద్, ఉపాధ్యాయుడు బి. ప్రసాద్ తదితరులు బహుమతులు అందజేశారు.

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

వినియోగంలోకి తెస్తే.. పంచాయతీలకు ఆదాయమే..!

వృథాగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు

న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, పొందూరు

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేస్తే పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరేలా గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రతి పంచాయతీకి ఒకటి చొప్పున ఈ కేంద్రాలను మంజూరు చేశారు. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని పూర్తిగా విస్మరించింది. అక్కడ పనిచేసే కార్మికులకు సరిగ్గా జీతాలు ఇవ్వకపోవడంతో పాటు రిక్షాలు, ఇతర యంత్రాలు మరమ్మతులకు గురైతే వాటిని బాగు చేయక నిర్లక్ష్యం వహించింది. దీంతో ఈ కేంద్రాలు మూలకు చేరాయి.

● **శిథిలావస్థకు చేరి..:** ఆమదాలవలస నియోజకవర్గంలోని కొన్ని చోట్ల నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని చోట్ల వాటిలో పనికిరాని మొక్కలు పెరిగిపోవడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. ఫలితంగా గ్రామాల్లో స్వచ్ఛ సంకల్పం లక్ష్యం నీరుగారిపోయింది. నియోజకవర్గంలోని సంపద తయారీ కేంద్రాల పరిస్థితే ఇందుకు నిదర్శనం.



నిరుపయోగంగా ఉన్న సరుబుజ్జిలి చెత్త సంపద కేంద్రం

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటిని వినియోగంలోకి తీసుకొచ్చి పల్లెల శుభ్రతకు పెద్దపీట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

● **స్థల సమస్య వల్లే జాప్యం:** నియోజకవర్గంలో కొన్ని కేంద్రాలకు స్థల సమస్య తలెత్తడంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనులు ముందుకు సాగడం లేదు. వీలైనంత త్వరగా నియోజకవర్గ వ్యాప్తంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపడతాం.

– **రామారావు, గోపాలరావు, సింహాచలం, విజయలక్ష్మి, సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ మండలాల ఈవోపీఆర్డీలు**

● **నియోజకవర్గంలో..:** 110 పంచాయతీలు ఉండగా ఇప్పటికి మూడు విడతలుగా 108 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మంజూరు చేశారు. గ్రామ జనాభాను బట్టి ఒక్కొక్క కేంద్ర నిర్మాణానికి ఉపాధిహామీ పథకం నిధులు కేటాయించారు. ఇప్పటి వరకు కేవలం 80 కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. వీటిలో కొన్ని మాత్రమే వినియోగంలోకి వచ్చాయి. కొన్ని చోట్ల ఈ కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు, ఇతరులు వారి అవసరాల కోసం వినియోగించుకునేందుకు ఉపయోగపడుతున్నాయి.

● సరుబుజ్జిలి, గోనెపాడు, బప్పడాం, దకరవలస, పెద్దపాలెం, మూలసవలాపురం, విజయరాంపురం, కొత్తకోట, షళంత్రి తదితర గ్రామాల్లో నిర్మించిన చెత్త సంపద కేంద్రాల గోడలు పగుళ్లు దేరి శిథిలావస్థకు చేరుకోగా మరికొన్ని కేంద్రాలు వినియోగంలో లేక నిరుపయోగంగా పడి ఉన్నాయి.

● పొందూరు మండల కేంద్రంతో పాటు బాణాం, దల్లవలస, గోకర్ణపల్లి, కొంచాడ, కోటిపల్లి, లోలుగు తదితర గ్రామాల్లోనూ ఈ కేంద్రాలదీ ఇదే పరిస్థితి.

తెదేపా సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి: ఎంపీ

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: ఎచ్చెర్ల నియోజకవర్గంలో శనివారం నుంచి ప్రారంభమవుతున్న తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. రణస్థలంలో శుక్రవారం సభ్యత్వ నమోదుపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెదేపాలో సభ్యత్వం తీసుకోవడం గొప్ప అవకాశమని, దీని వల్ల రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు లంక శ్యామలరావు, నేతలు గొర్లె లక్ష్మణరావు, పిసిని జగన్నాథం నాయుడు, పిన్నింటి భానోజీరావు నాయుడు, ముక్కు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



సృజనకు పదును పెట్టి.. విజేతలుగా నిలిచి..



ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని గేటు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఎం.ప్రసన్న (9వ తరగతి), ఎం.రామలక్ష్మి (8వ తరగతి), సీహెచ్.హర్షవర్ధన్ (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.వి.రమణమ్మ, ఉపాధ్యాయులు డి.ఆనంద్, ఎన్.వి. రమణ, జి.కాంతారావు ప్రశంసాపత్రాలు అందజేశారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

పశు గణన ప్రారంభం

శ్రీకాకుళం గ్రామీణం, ఆమదాలవలస పట్టణం, సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం కిష్టప్పపేటలో శుక్రవారం పశుగణనకు సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆవిష్కరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశుగణన జరుగుతుందని తెలిపారు. ఏడీ డా.పీఎస్‌జీ బాలకృష్ణ, వీపీసీ వై.కృష్ణారావు, పశువైద్యాధికారి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. ● ఆమదాలవలస మండలం, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి పశు గణన ప్రారంభమైనట్లు మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు ఆర్.ఆనందరావు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో గోడప్రతులను వారు ఆవిష్కరించారు. ● పశుగణనపై గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ అన్నారు. మండలంలోని షళంత్రి గ్రామీణ పశువైద్య కేంద్రం వద్ద పశుగణన గోడప్రతులను విడుదల చేశారు. సరుబుజ్జిలి పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అఖిల భారత పశుగణనను ప్రారంభించారు.



గోడ ప్రతులు చూపుతున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, ఇతర అధికారులు



రహదారి పైకి మురుగునీరు

బూర్జ మండలం మామిడివలసలో చాలా కాలంగా మురుగునీరు రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా కాలం కిందట గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించారే తప్పా కాలువలు మాత్రం నిర్మించకపోవడంతో గ్రామంలో ఇళ్లల్లో వాడుకల నీరంతా రహదారిపై ప్రవహిస్తుంది. ఈ విషయమై బూర్జ ఎంపీడీవో తిరుపతిరావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ఇటీవలే విధుల్లో చేరానని, సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

–న్యూస్‌టుడే, బూర్జ

కుక్కలతో బెంబేలు

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం, పరిసరాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మైదానంలో ఉదయం, సాయంత్రం వచ్చే నడకదారులు, విద్యార్థులు, క్రీడాకారుల వెంటపడి దాడికి యత్నిస్తుండటంతో బెంబేలెత్తుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా శునకాలను పట్టించి వాటి సంతతి నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



ఉపాధి మేళాలో 48 మంది ఎంపిక

బలగ(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో శుక్రవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధి మేళాలో 48 మంది ఎంపికయ్యారని ఐటీఐ ఏడీ రామ్మోహనరావు తెలిపారు. 106 మంది హాజరయ్యారని చెప్పారు. వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించండి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని పోలీసు క్వార్టర్స్ వద్ద జిల్లా సాయుధ పోలీసు దళం మైదానంలో శుక్రవారం నిర్వహించిన పోలీసు పరేడ్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఆర్ పోలీసుల గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సాయుధ పోలీసుల సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహించారు. డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు, ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.



సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

ఏపీ పర్యావరణ అంచనాల కమిటీ సభ్యుడిగా పొందూరు వాసి

పొందూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యావరణ అంచనాల కమిటీ సభ్యునిగా పొందూరు పట్టణానికి చెందిన గుంటుకు గిరిజా శంకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న గిరిజాశంకర్‌ను పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వశాఖ ఈ మేరకు సభ్యునిగా ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ల పాటు ఈయన ఈ పదవిలో కొనసాగనున్నారు. మాజీ సర్పంచి విజయలక్ష్మి, సాయికుమార్, డాక్టర్ ప్రకాశరావు తదితరులు ఈ సందర్భంగా ఈయనకు అభినందనలు తెలిపారు.



గిరిజా శంకర్

చేపల పెంపకంలో యాజమాన్య పద్ధతులే ముఖ్యం

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: చేపల పెంపకంలో యాజమాన్య పద్ధతులే ముఖ్యమని అని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త కె. భాగ్యలక్ష్మి అన్నారు. వివిధ మండలాల మత్స్య రైతులకు శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువ రైతులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని లాభాలు పొందవచ్చని తెలిపారు. మత్స్య శాస్త్రవేత్తలు బాలకృష్ణ, జీఎస్ రాయ్, సునీత తదితరులు పాల్గొన్నారు.



మత్స్య రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

గార, న్యూస్‌టుడే: మండల పరిధిలో ఓ గ్రామానికి చెందిన వివాహిత తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేశారని ఎస్సై జనార్దన తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున చేపలు వేటకు వెళ్లి తిరిగి రాలేదని అందులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

స్థల పరిశీలన

బూర్జ, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దపేట విత్తనాభివృద్ధి క్షేత్రానికి చెందిన భూమిని రెండేళ్ల కిందట వైకాపా ప్రభుత్వం ఉద్యాన పరిశోధన కేంద్రం పేరిట కేటాయించి నేడు వినియోగానికి దూరంగా ఉండేలా చేశారని మార్క్‌ఫెడ్ డైరెక్టరు ఆనెపు రామకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఉద్యాన పరిశోధన కేంద్రానికి కేటాయించిన భూమిని తహసీల్దారు పద్మావతి సిబ్బందితో పరిశీలన చేయించారు. 70 ఎకరాలు బీడు భూమిని తలపిస్తోందని, దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎచ్చెర్ల(లావేరు), న్యూస్‌టుడే: లావేరు మండలం బుడుమూరు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జాతీయ రహదారి నిర్వహణ పనుల సూపర్‌వైజర్ సంతోష్‌కుమార్ గాయాలపాలయ్యాడు. లావేరు ఎస్సై లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌కుమార్ రోడ్డు నిర్వహణ పనులు చేస్తుండగా శ్రీకాకుళం వైపు నుంచి రణస్థలం వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టడంతో ఫ్లైఓవర్‌పై నుంచి కింద పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలు కాగా 108 వాహనంలో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి బీహార్‌కు చెందినవాడు. లావేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీల పట్టివేత

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస మండలం దూసి, కొత్తవలస గ్రామాల రహదారి మధ్యలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకొని సీజ్ చేసినట్లు తహసీల్దారు రాంబాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నాగావళి నదీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్తున్న ఇసుక లారీలను నిలిపి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి ఆమదాలవలస పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఆయనతో పాటు వీఆర్వో రాజు, మురళీ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

శ్రీకాకుళం అర్బన్, పొందూరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో వసతి గృహాలను జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు శుక్రవారం తనిఖీ చేశారు. శ్రీకాకుళం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, శ్రీకాకుళం ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహం, సింగుపురం వసతిగృహాలను ఆయన పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ❖ వసతిగృహాన్ని, పరిసరాలను సిబ్బందితో పాటు విద్యార్థులు శుభ్రంగా ఉంచుకోవాలని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. మండలంలోని కింతలి, తాడివలస బీసీ బాలుర వసతి గృహాలను ఆమె పరిశీలించారు. అనంతరం వసతి గృహాల గదులను, పరిసరాలను పరిశీలించారు. ఆమెతో పాటు న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.



బీసీ వసతిగృహంలో ప్రసంగిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు



కింతలి బాలుర వసతి గృహ విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు దళం కార్యాలయం ఆవరణలోని కల్యాణ మండపంలో పోలీసు సిబ్బంది, వారి పిల్లలకు 'పర్యావరణ పరిరక్షణలో పోలీసులకు సవాళ్లు' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు శుక్రవారం జరిగాయి. విజేతలకు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, ఎచ్చెర్ల



సాయుధ పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌస్

అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా ఎచ్చెర్లలోని జిల్లా సాయుధ పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ పోలీసు అధికారులు పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించే సాంకేతిక పరికరాలు, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్ సామగ్రి, వివిధ రకాల ఆయుధాలు, పోలీసు జాగిలాల పనితీరు, డ్రోన్స్ వినియోగం, వేలిముద్రల సేకరణ, బాడీ వార్న్ కెమెరాలు, సిగ్నల్స్, స్పీడ్ గన్‌తో తదితర పరికరాల పనితీరును పాఠశాల విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఆర్ అధికారులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు ఉంటుందని తెలిపారు.

– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

